నేడు ఓయూలో యోగా డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నేడు అంతర్జాతీయ యోగా డే నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎస్‌ఎస్‌ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు శాగంటి రాజేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఏ గ్రౌండ్స్‌లోని సింథటిక్స్ కోర్సులో ఉదయం 6.30 జరిగే యోగా కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆయన పేర్కొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సనత్‌నగర్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అన్నారు. బేగంపేట డివిజన్ ద్వారకాదాస్ కాలనీలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఫాగింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంటమాలజీ సిబ్బంది క్రమం తప్పకుండా ప్రతిబస్తీలో నిర్దేశించిన తేదీల్లో ఫాగింగ్ ప్రక్రియను కొనసాగించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, రఘునాథ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్ ఏఎస్‌బీఎంతో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: దుబాయ్‌కి చెందిన అల్బెడో స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఏఎస్‌బీఎం)తో ఓయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం వివిధ అంశాల పై ఒప్పందాలు కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు(ఏఐ), యంత్ర అభ్యాసం (ఎంఎల్), డేటా విశ్లేషణ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ భాగస్వామ్యంతో పరిశ్రమలకు అనుగుణమైన సర్టిఫికెట్ కార్యక్రమాలు, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు, అనుభవాధారిత శిక్షణలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు, ప్రొ.గడ్డం మల్లేశం, ఏఎస్‌బీఎం ఎండీ కేఆర్ సవిత పాల్గొన్నారు.

ఓయూలో పీహెచ్‌డీ మెస్ మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని పీహెచ్‌డీ విద్యార్థుల మెస్ (భోజనశాల)ను మూసివేశారు. వివిధ కోర్సులకు సంబంధించిన 2017, 2018 ప్రవేశం పొందిన రెండేళ్ల బ్యాచ్ పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలకు మరో ఏడాది గడువును పొడిగించాలని అధికారులను కోరగా కేవలం 2018 బ్యాచ్ విద్యార్థులకు మాత్రమే 45 రోజులు పొడిగించారు. అయినా వారికి భోజన వసతిని రద్దు చేయడంతో హాస్టల్ వసతి గల విద్యార్థుల సంఖ్య 92 నుంచి 21కి తగ్గడంతో పీహెచ్‌డీ మెస్‌ను కూడా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కేవలం 10 మంది పీహెచ్‌డీ విద్యార్థులు మాత్రమే ఉన్నారని వారికి పీజీ హాస్టల్ మెస్‌లో భోజన వసతి కల్పించినట్లు చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

అడ్డగుట్ట: అర్హులందరికీ కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు మారేడుపల్లి తహసీల్దార్‌ను భీమయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు అజయ్‌బాబు మాట్లాడుతూ.. ఏడాదిన్నరగా దాదాపు 830 పెన్షన్ దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపించామని తహసీల్దార్ చెబుతున్నప్పటికీ పెన్షన్లు మంజూరు కాకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అర్హులైన వారికి వెంటనే మంజూరు చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జోన్ నాయకులు ఆర్. మల్లేశ్, బి. శారద, ఎం. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌లోని శాస్త్రీనగర్‌లో కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగాల శ్రీనివాస్, నక్క మధు, మనోహర్, శ్రీనివాస్ గౌడ్, ఎల్లయ్య, దాసరి శ్రీనివాస్, గణేశ్, శ్రీరామ్ నాయక్, దేవయ్య, నర్సింగ్, మల్లేశ్, అంజమ్మ, భాగ్య, జీహెచ్‌ఎంసీ ఏఈ తివారీ, సూపర్ వైజర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

చేద్దామా.. యోగా



సనత్‌నగర్ నవవనాల పార్కులో శిక్షణ పొందుతున్న మహిళలు

ఉచిత శిక్షణ ఇస్తున్న పలు సంస్థలు

- ప్రజల్లో ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- యోగా సాధకులతో సందడిగా పార్కులు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- నియోజకవర్గంలోని శిబిరాలపై కథనం

సనత్‌నగర్: తెల్లరి లేచింది మొదలు..రాత్రి పడుకునే వరకు అంతా గజి'బిజీ' జీవితమే. ఎన్నో సవాళ్లు..ఒత్తిళ్లు. ఉరుకుల పరుగుల జీవితంలో నగరవాసి అసలు తన ఆరోగ్యం గురించి ఆలోచించే తీరిక లేకుండా పోతోంది. ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు చుట్టుముడితే గానీ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. అప్పుడు వైద్యులు సూచిస్తే తప్ప శారీరక వ్యాయామంపై దృష్టి పెట్టడం లేద. అసలు ఆరోగ్య సమస్యలు రానీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకు యోగా సరైన మార్గంగా సూచిస్తున్నారు. యోగా ప్రాముఖ్యతపై దశాబ్దాలుగా కొన్ని సంస్థలు ప్రచారం చేయడంతో పాటు ఉచిత శిక్షణను కూడా అందిస్తున్నాయి. దీంతో చాలావరకు పార్కులు ఇప్పుడు యోగా కేంద్రాలుగా మారిపోయాయి. సూర్యోదయానికి ముందే యోగ సాధకులు రెడీ అయిపోతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో గతంలో ఒకటి రెండు పార్కులకు మించి యోగా కేంద్రాలు నడిచేవి కావు. కానీ ఇప్పుడు ప్రజల్లో చైతన్యం పెరగడంతో ఏ పార్కు చూసినా యోగా శిక్షణ కేంద్రాలుగా అవతరించాయి. ఇందుకు పలు సంస్థలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఉచితంగా శిక్షణ ఇస్తున్నాయి. శిక్షణ పొందిన వారే శిక్షకులుగా మారి మరెందరికో ఆరోగ్యదానం చేస్తుండడం విశేషం.

నిరంతర యోగ శిక్షణలో భారతీయ యోగా సంస్థాన్..

భారతీయ యోగా సంస్థాన్ ఆరోగ్య భారతాన్ని నెలకొల్పే దిశగా ముందుకుసాగుతోంది. ఐదున్నర దశాబ్దాల క్రితం ప్రారంభమైన శిక్షణ ఇప్పుడు వేలాది మంది ఆరోగ్యదానం చేసే కేంద్రంగా మారింది. నగరవ్యాప్తంగా పదుల సంఖ్యలో సెంటర్ల ద్వారా యోగాసనాలు నేర్పిస్తుండగా సనత్‌నగర్ నియోజకవర్గంలో సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కు, వినాయక గ్రౌండ్, బీకేగూడ పార్కు, కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కు, జెక్‌కాలనీ, బేగంపేట మయూరిమార్గ్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో ఉచితంగా యోగ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మహిళలకు వేర్వేరుగా శిక్షణ ఇస్తూ వారిలో ఆత్మ విశ్వాసనాన్ని పెంపొందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వర్ష్యన్‌నాయక్ తెలిపారు

యోగా గురువు ఉండాలనే తపనతో..

ప్రతి ఇంట్లో యోగా గురువు ఉండాలనే తపనతో నిర్మల్ సాధన జ్యోతి ముందుకుసాగుతోంది. 4 దశాబ్దాలుగా పైగా ఆమె శిక్షణ ఇస్తూ ఇప్పటివరకు వేలాది మందిని యోగా గురువులుగా తీర్చిదిద్దారు. ఇక్కడ టీచర్ ట్రైనింగ్ తీసుకున్నవారు వివిధ రాష్ట్రాలు, దేశాల్లో సైతం గురువులుగా మారి శిక్షణ అందిస్తుండడం విశేషం. నగర వ్యాప్తంగా పలు సెంటర్ల ద్వారా ప్రతిరోజూ వందలాది మందికి శిక్షణ ఇస్తున్నారు. కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ పార్కు, కృష్ణకాంత్‌పార్కు, హిందూ పబ్లిక్ స్కూల్, అమీర్‌పేట, బాలానగర్, ఆల్విన్‌కాలనీ, మూసాపేట, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు.

అమీర్‌పేట నేచర్‌క్యూర్ ప్రాంగణంలో..

అమీర్‌పేట నేచర్‌క్యూర్ ఆస్పత్రి ప్రాంగణంలోని తెలంగాణ రాష్ట్ర యోగాధ్యాయ పరిషత్ ఆధ్వర్యంలో రోజుకు 500 మందికి పైగా శిక్షణ ఇస్తున్నారు. యోగా థెరఫీతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే కేంద్రంగా అవతరించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు ఇక్కడ యోగా థెరఫీ తీసుకుని ఉపశమనం పొందుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



భోలక్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ. 46 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, వెంకటేషన్‌రాజు, జి. పవన్‌కుమార్ గౌడ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సుందరయ్యాబస్తీ, పెంటయ్యాబస్తీ, గొల్లకొమురయ్య ప్రాంతాల్లో పర్యటించారు. దీంతో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బోర్‌వెల్స్ పని చేయడం లేదని, వీధిదీపాలు వెలగడం లేదని, అదేవిధంగా గొల్లకొమురయ్య కాలనీ ప్రధాన రహదారిలో నిత్యం డ్రైనేజీ ప్రవాహం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మీపతి, ఏసూరి మహేశ్, మహేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కుమార్ యాదవ్, ప్రేమ్, గజ్జెల శ్రీనివాస్, డి. జనార్దన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన సైకిల్ షాప్ నర్సింహ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

గోపాల్‌దాస్ మఠం సందర్శన...

బన్సీలాల్‌పేట్ శ్మశానవాటిక ఆవరణలోని గోపాల్‌దాస్ మఠాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. 80 ఏళ్ల పురాతన మఠంలో షెడ్డు నిర్మించాలని, ఫ్లోరింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ అధ్యక్షుడు శంకర్‌బాబు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

తరగతి గది ప్రారంభం...

పద్మారావునగర్: నల్లగుట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 26 లక్షల వ్యయంతో పూర్వ విద్యార్థిని స్వర్ణలత జ్ఞాపకార్థం నిర్మించిన నూతన తరగతి గదిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు క్రీడా సామగ్రి ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, కృష్ణమూర్తి, స్కూల్ గది నిర్మాణ దాత నందకుమార్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ వితరణ

చిలకలగూడ: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, జేపీ మోర్గాన్ టీమ్ సంయుక్తాధ్వర్యంలో చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ కిట్లను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జూబ్లీహిల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, ప్రాజెక్ట్ సర్వీస్ డైరెక్టర్ రాజకృష్ణ, జేపీమోర్గాన్ టీం సభ్యులు డిసిల్వా, గోవిందరాజన్, నిరంజన్‌కుమార్, శైలజ, విఘ్నేష్, పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణానికి పకడ్బందీగా ఏర్పాట్లు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేందర్‌గౌడ్ అన్నారు. చైర్మన్ సాయిబాబాగౌడ్, సూపరింటెండెంట్ హైమావతితో కలిసి శుక్రవారం వేడుకల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కల్యాణం తిలకించేందుకు ఏటా 250 వరకు టికెట్లు ఇచ్చేవారని ఈసారి 150 టికెట్లకు కుదించాలని కలెక్టర్, పోలీసు అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి బదులుగా కల్యాణ పూజ టిక్కెట్లు 300 వరకు విక్రయిస్తామన్నారు. ఈ టికెట్లు తీసుకున్న దంపతులకు కల్యాణ వేడుకలో పాల్గొనే అవకాశం లేనప్పటికీ వేద పండితులతో అమ్మవారి వద్ద గోత్రనామాలతో సంకల్పం చెప్పబడుతుందన్నారు. అలాగే వీవీఐపీ టికెట్లు 100, డోనర్ పాసులు 50 మాత్రమే ఇస్తామని ఒక్కో టిక్కెట్‌పై ఇద్దరిని అనుమతిస్తామని తెలిపారు. కల్యాణాన్ని వీక్షించేందుకు వీలుగా గతంలో కంటే ఎల్‌సీడీ స్క్రీన్ల సంఖ్య మరింత పెంచడంతో పాటు సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతామన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. పాతబస్తీలోని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్‌గా నియమితులైన గోపిశెట్టి రాఘవేందర్‌తో పాటు వివిధ ఆలయాల కమిటీ చైర్మన్లు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్షలాధిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలిసిన వారిలో ఉప్పుగూడ మహంకాళి ఆలయ చైర్మన్ మధుగౌడ్, బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ మధుసూదన్‌యాదవ్, సభ్యులు భవానీశంకర్, గుర్నాథ రెడ్డి, ఆనంద్, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

సికింద్రాబాద్: రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు దక్షిణ మధ్య రైల్వే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అండగా ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి తెలిపారు. రైల్వే ఉద్యోగులు 8 మంది మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.2 కోట్ల చెక్కులను శుక్రవారం అందించారు. ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో సభ్యులుగా ఉన్న ఉద్యోగులు మృతి చెందితే ఆర్థిక సాయంతో పాటు వారి పేరిట ఉన్న రుణాలు మాఫీ చేయడంతో పాటు వాటా ధనాన్ని కుటుంబ సభ్యులకు అందిస్తున్నామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రాంమోహన్, కార్యదర్శి శర్మ, డైరెక్టర్లు అంజియాదవ్, మహేశ్, కుమార్, రాజేందర్, రమేశ్, కృష్ణయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీ : ఇద్దరి అరెస్టు

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణాలు చేస్తూ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్‌ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభయ్‌రాజ్‌సింగ్ (28), మిథిలేశ్‌గిరి (20) ఇరువురు కూలీలు. వీరికి మద్యం, జూదం, ధూమపానం తదితర దురలవాట్లు ఉన్నాయి. కూలీ పనుల ద్వారా వచ్చే డబ్బు సరిపోక పోవడంతో రైళ్లలో ప్రయాణిస్తూ దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు వేర్వేరుగా కలిసి కొన్ని దొంగతనాలకు పాల్పడ్డారు. సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో కొద్ది రోజుల క్రితం వీరు పలు దొంగతనాలకు పాల్పడ్డారు. ఈనెల 20న రైల్వేస్టేషన్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. నిందితుల నుంచి సుమారు రూ.30 లక్షల విలువ చేసే 30 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో తండ్రి, కుమారుడి రిమాండ్

అమీర్‌పేట: హత్యాయత్నం కేసులో తండ్రి, కొడుకులను పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన శివప్రసాద్ (25) తన స్నేహితుడు ప్రదీప్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విందుకు మరో నలుగురు స్నేహితులతో కలిసి వచ్చాడు. కారును బీకేగూడ ధనలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదుట రోడ్డుపై నిలిపాడు. భోజనాలు చేశాక తిరిగి కారు వద్దకు వచ్చారు. కారుకు అడ్డంగా ఆటో ఎవరూ పెట్టారని వాచ్‌మెన్‌ను శ్రీనివాస్ అడిగాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడికి వచ్చిన వాచ్‌మెన్ కుమారుడు హరీశ్ కత్తెరతో శివప్రసాద్‌ను పొడిచాడు. తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు తండ్రి, కొడుకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

బన్సీలాల్‌పేట్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. గాంధీనగర్ పీఎస్ పరిధిలోని చాచానెహ్రూనగర్‌లో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగార్ఆమె మాట్లాడుతూ.. 80 వాహనాలు, ఓ కారు పట్టుబడిందన్నారు. సంగీత అనే మహిళ ఇంట్లో 32 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే బస్తీలో పలువురు బర్త్‌డే పేరిట వేడుకలు చేస్తూ హంగామా చేస్తున్నారని, అదేవిధంగా గంజాయి సేవిస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని పలువురు స్థానికులు డీసీపీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఏసీపీ ఎ. యాదగిరి, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, డీఐ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐలు హరీశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలి



జీహెచ్‌ఎంసీ జడ్‌సీ రవికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: ఆషాఢ మాసం బోనాల జాతరను పురస్కరించుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు సాధన సమితి ప్రతినిధులతో కలిసి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల వద్ద రహదారుల మరమ్మతు, వరదనీటి కాల్వల పునరుద్ధరణ తదితర అభివృద్ధి పనుల కోసం రూ. 10 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్, మిట్టపల్లి బాబూరావు, సునీల్ ముదిరాజ్, మహ్మద్ అజీజ్, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి, రవీందర్ సాగర్, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సనత్‌నగర్: మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన వెంకటయ్య, శేషమ్మ, ఇంద్రమ్మ, పాడెండ్ల శ్రీనివాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో ఎమ్మెల్సీ వాణీదేవి సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.

పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

చిలకలగూడ : పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈనెల 29న జరిగే సికింద్రాబాద్ 4వ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ చిలకలగూడ, మైలార్‌గడ్డ ఆటోస్టాండ్‌ల వద్ద శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాలాపేట నఫీజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగే మహాసభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, గౌస్, రవి, ఈరయ్య, భిక్షపతి, చందర్, వెంకటయ్య, పెద్దకుమార్ పాల్గొన్నారు.

కోరిక తీర్చాలంటూ మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: కోరిక తీర్చాలంటూ మహిళను వేధిస్తున్న వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతానికి చెందిన మహిళ (26) బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేసి 2023లో మానేసింది. ఆ సమయంలో ఆమెకు ప్రైవేట్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న మనీశ్ (52) పరిచయమయ్యాడు. ఆమెను తన కూతురిలా భావిస్తున్నానని చెప్పేవాడు. అవసరాలకు డబ్బు ఇచ్చేవాడు. 2024లో మహిళ హైటెక్ సిటీలోని మరో బ్యాంకులో పనిలో చేరింది. కాగా ఏప్రిల్ 2024 నుంచి మనీష్ ప్రవర్తనలో మార్పును బాధితురాలు గుర్తించింది. తరచూ ఆమెకు వాట్సప్‌లో తాను ఇచ్చిన డబ్బు ఇవ్వాలని, లేకుంటే తన కోరిక తీర్చాలని వేధించడం మొదలుపెట్టాడు. అసభ్యకరంగా దూషిస్తూ వాట్సప్ సందేశాలు పంపేవాడు. ఆమె పనిచేస్తున్న బ్యాంక్‌కు వెళ్లి అక్కడి సిబ్బందికి బాధితురాలి గురించి చెడుగా ప్రచారం చేయగా వారు ఆమెను పనిలోకి రావద్దని చెప్పారు. దీంతో బాధితురాలు శనివారం బేగంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా మనీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జగన్

లాలాపేట: మూడు కమిషనరేట్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి దాదాపు రూ 2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఓయూ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ జగన్, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడుతో కలిసి వివరాలు వెల్లడించారు. చింతల్ వాజ్‌పేయినగర్‌కు చెందిన శ్రీరామ్ నరసింహాచారి (39). 7వ తరగతి వరకు మాత్రమే చదివాడు. కార్పెంటర్, డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మద్యం, వ్యసనాలకు బానిసయ్యాడు. జల్సాలకు కావాల్సిన డబ్బుల కోసం దొంగతనాల బాట పట్టాడు. ఈ క్రమంలో ఈనెలలో హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లో తాళం వేసి ఉన్న ఓ ఇంటి ప్రధాన ద్వారం, కిటికి అద్దం పగులగొట్టి లోనికి చొరబడ్డాడు. బీరువాలోని 1.5 తులాల (2 జతల బంగారు చెవి రింగులు, సాయిబాబా లాకెట్) ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులను ఎత్తుకెళ్లాడు. బీబీనగర్‌లో ఉంటున్న ఇంటి యజమాని ఈ విషయమై ఈనెల 11న ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ బృందం శ్రీరామ్ నరసింహాచారిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఈ కేసుతో పాటు వారాసీగూడ, ఉప్పల్ పోలీసు స్టేషన్ల పరిధిలోనూ పలు నేరాలు పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని దాదాపు 24 కేసుల్లో ప్రమేయం ఉందని ఏసీపీ తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ శ్రీనివాసనగర్, మార్కండేయనగర్, వెంకటేశ్వరనగర్, ఫ్రైడేమార్కెట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదానికి పంపామని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఉద్యానవనశాఖ అధికారులు, సిబ్బందితో మాట్లాడి ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించారు. బీఆర్‌ఎస్ నాయకులు శైలేందర్, రవీంద్ర సాగర్, భాస్కర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపైనే చర్చంతా

బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ బోర్డు అధ్యక్షతన సమావేశం



బోర్డు సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కంటోన్మెంట్: పాలనా పరమైన అంశాలపై కీలక తీర్మానాలే ప్రధాన ఎజెండాగా సాగాల్సిన కంటోన్మెంట్ బోర్డు సమావేశం కాస్తా అక్రమ నిర్మాణాలపై చర్చగా మారింది. గతంలోనూ ఇదే అంశంపై తీవ్రంగా చర్చ జరిగింది. ఇక నోటీసులతో లాభం లేదని భావించిన బోర్డు అధికారులు, కొత్తగా మార్టిగేజ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే ఇప్పటికే చేపట్టిన అక్రమ నిర్మాణాల సంగతేంటని వారికి శిక్ష పడాల్సిందేనని ఎమ్మెల్యే శ్రీగణేశ్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్. రాజీవ్ నేతృత్వంలో మొదటి సమావేశాన్ని గురువారం నిర్వహించగా సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వన్షీ, సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరయ్యారు.

అమల్లోకి మార్టిగేజ్ విధానం..

అక్రమ నిర్మాణాలను ఆదిలోనే నిలిపేసేందుకు బోర్డు అధికారులు ప్రయత్నించినా, కోర్టుల జోక్యంతో సాధ్యం కావడం లేదు. కోర్టుల్లో వివాదం కొనసాగుతుండగానే ఆయా నిర్మాణాలు పూర్తవుతుండడం గమనార్హం. ఈ మేరకు కంటోన్మెంట్‌వ్యాప్తంగా వందల సంఖ్యల్లో అప్పీల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేలా బోర్డు అధికారులు గత సమావేశంలో మార్టిగేజ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. బోర్డు ఆమోదంతో తాజాగా సమావేశంలో మార్టిగేజ్ నిబంధనల మేరకే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. 133 గజాలకు పైగా వైశాల్యంలో చేపట్టే ప్రతి నిర్మాణానికి సంబంధించి ముందస్తుగా 10 శాతం కంటోన్మెంట్‌కు మార్టిగేజ్ చేయాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు.

నోటీసులతో సరిపెట్టొద్దు : ఎమ్మెల్యే శ్రీగణేశ్

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలంటూ బోర్డు చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి, అప్పీల్స్ పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి కౌంటర్లు దాఖలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అక్రమాలకు అనుకూలంగా కోర్టు తీర్పులు వస్తుండగా, వాటికి సంబంధించి పక్కా ఆధారాలు సమర్పించి, చర్యలు చేపట్టాలని ఈ మేరకు బోర్డు అడ్వొకేట్ కౌన్సిల్ కౌంటర్లు వేసేలా చూడాలన్నారు.

- సమావేశం చివర్లో కేంద్రం నుంచి రావాల్సిన ఆర్మీ సర్వీసు చార్జీల అంశాన్ని ఎమ్మెల్యే శ్రీగణేశ్ లేవనెత్తగా, రాష్ట్రం నుంచి రావాల్సిన టీపీటీ బకాయిల అంశాన్ని బోర్డు సభ్యురాలు భానుక నర్మద ప్రశ్నించారు.
- ప్యాట్నీ నాలాపై అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు ఇటీవలే కూల్చివేయగా, మళ్లీ ఆక్రమణకు గురికాకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన పరిహారం సొమ్ము విడుదలకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపినందున, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రిటైనింగ్ ఏర్పాటు చేయాలని బోర్డు అధికారులు కోరారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ అంగీకారం తెలిపిందని సీఈఓ మధుకర్ నాయక్ వెల్లడించారు.